క్లుప్తంగా

పాగాకు వద్దు.. జీవితమే ముద్దు..



కోటవురట్లలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కోటవురట్ల: పాగాకు వద్దు.. జీవితమే ముద్దు అంటూ విద్యార్థులు నినదించారు. స్థానిక పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం పాగాకు వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ర్యాలీ చేశారు. ప్లకార్డులు చేతబట్టి పాగాకు వాడడం వల్ల కలిగే నష్టాలపై నినాదాలు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు సాగిన ఈ ర్యాలీ ఇన్‌చార్జ్ హెచ్ఎం సుకుమార్, ఉపాధ్యాయులు బి.ఎస్.ప్రసాద్, కృష్ణ, నాగేశ్వరరావు, వెంకటరత్నం, రాజీవ్, రమణ, వీరబాబు, కిషోర్, బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



విద్యార్థికి కంటి అద్దాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కోటవురట్ల: కొడవటిపూడి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సీఫా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విశాఖ ఐ కేర్ సిబ్బంది ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఒక విద్యార్థికి కళ్లద్దాలు ఉచితంగా అందజేశారు. హెచ్ఎం ఆర్.ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ యలమంచిలి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ



యూరియా అందజేస్తున్న సర్పంచ్ మంగవేణి కోటేశ్వరరావు

మునగపాక: మండలంలోని తోటాడ సచివాలయ ప్రాంగణంలో మంగళవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు రైతులకు యూరియా అందజేశారు. ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, మాజీ ఎంపీటీసీ దాడి శ్రీనివాసరావు, పెద్దలు దొడ్డి రమేష్, ఆడారి జగన్నాథరావు, నాయుడు, వీఆర్వో కన్నారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుక



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మునగపాక: స్థానిక నేషనల్ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఇక్కడ ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో నిర్వహించిన వేడుకలకు కళాశాల కరస్పాండెంట్ బొడ్డేడ మహేష్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం పిల్లల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల కరస్పాండెంట్ కె.బాల సంజీవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ఎం ప్రసాద్, డైరెక్టర్లు కె.ఈశ్వరరావు, వి.శ్రీను, బి.రమేష్, సిబ్బంది బి.బాలగణేష్, వెంకట్, ఎన్.శ్రీను, జగ్గప్పారావు, శ్రావణి, గీత తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఎగబడ్డ రైతులు



రైతులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రరాజు, శోభనబాబు

అచ్యుతాపురం రూరల్: రైతులకు సకాలంలో యూరియా అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మంగళవారం ఉప్పవరం రైతు సేవా కేంద్రంలో నాలుగు గ్రామాల రైతులు ఎరువుల కోసం ఎగబడ్డారు. ఉప్పవరం, యర్రవరం, మళ్లవరం, నరేంద్రపురం గ్రామాల రైతులు ఆకలితో అలమటించి ఇబ్బంది పడ్డారు. అధికార పార్టీ నాయకులకు అడిగినంత ముందుగా యూరియా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి పిన్నమరాజు రవీంద్రరాజు, ఎంపీటీసీ రావి నాగలక్ష్మిశోభనబాబు రైతుల సమస్య తెలుసుకుని అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ ఉద్యానవన సహాయకుడు కె.నాగేశ్వర్రావు మాట్లాడుతూ మొదటి విడతగా 36 టన్నులు యూరియా అందించామన్నారు. మిగిలిన రైతులకు యూరియా వచ్చిన వెంటనే అందజేస్తామన్నారు.



కౌలురైతులకు కూటమి దెబ్బ..!

'అన్నదాత సుఖీభవ'లో మొండిచేయి

వంట రుణాలు ఇవ్వని బ్యాంకులు

కౌలు గుర్తింపు కార్డులు ఊసేలేదు

అప్పుల పాలవుతున్న వైనం

కౌలు రైతులను ఆదుకోవాలి..



కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలి. అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నాం. మాకూ ఆర్థిక ఆసరా కల్పించాలి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కౌలు రైతులకు కూడా రైతు భరోసా పథకం ద్వారా ఏటా రూ.13,500 అందించారు. కూటమి ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పథకం ఇస్తామని చెప్పారు. ఏడాది దాటిపోయినా మాకు ఆసరా కలగలేదు.

– గొల్లు నరేష్, కౌలు రైతు, కె.వెంకటాపురం

రైతులను నిర్లక్ష్యం చేస్తోంది..



కూటమి ప్రభుత్వం రైతాంగాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. అమరావతిపై ఉన్న శ్రద్ధ రైతులపై కొంచెం కూడా కనిపించడంలేదు. చంద్రబాబు రైతులను ఎపుడూ చిన్న చూపే చూశారు. ఖరీఫ్ సీజను ప్రారంభమై ఇన్నాళ్లయినా రైతులకు ఎరువులు పూర్తి స్థాయిలో అందించలేకపోతున్నారు. యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇక కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కూటమికి రైతులే బుద్ధి చెబుతారు.

– రామసత్యనారాయణ, రైతు, కె.వెంకటాపురం

అర్హులందరికీ సీసీఆర్ కార్డులు..



కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించే విషయంలో ప్రభుత్వం ఎటువంటి మార్గదర్శకాలు విడుదల చేయలేదు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు కౌలు రైతుల ఎంపిక కోసం జాబితాను సిద్ధం చేస్తున్నాం. ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి అవుతోంది. దరఖాస్తు చేసుకున్న అర్హులైన కౌలుదారులకు సీసీఆర్ కార్డులను మంజూరు చేస్తారు.

– బి.సరోజిని, మండల వ్యవసాయాధికారి, కోటవురట్ల

కోటవురట్ల: కూటమి దెబ్బకు కౌలు రైతులు విలవిలలాడుతున్నారు. ఎన్నికల ముందు రైతును రాజును చేస్తామని తెగ ఊదరగొట్టింది. అంతేకాకుండా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై రైతుల్లో విషం నింపి ఓట్లు వేయించుకుంది. తీరా అధికారంలోకి వచ్చాక రైతులు కన్నీళ్లు పెట్టుకునే పరిస్థితులను సృష్టించింది. వ్యవసాయం వృథా అనుకునే స్థాయికి దిగజార్చింది. మామిడి, మిర్చి, ఉల్లి, టమాటా రైతులు కుదేలయ్యారు. పండించిన పంటను నేలపాలు చేసుకునేలా గిట్టుబాటు ధరను పతనం చేసింది. ఇపుడు యూరియా కోసం రోజంతా పడిగాపులు కాసేలా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఇదంతా ఒక ఎత్తు అయితే కౌలు రైతులను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. అప్పు చేసి భూమిని కౌలుకు తీసుకుని కొండంత ఆశతో పెట్టుబడి పెట్టి సాగు చేద్దామనుకుంటే ఆసరా లేకుండా చేసింది. పెట్టుబడి సాయం అందకుండా చేసి పక్కన పెట్టేసింది.

రైతుకు వెన్నుదన్నుగా ఉన్న గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుకు వెన్నుదన్నుగా నిలిచింది. అన్నింటా ఆసరా కల్పించి సాగుకు కొండంత భరోసానిచ్చింది. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు ముంగిటకే సమస్త వ్యవసాయ సేవలు రైతులకు అందేలా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేశారు. రైతు భరోసా పథకం ద్వారా రైతులందరితో పాటు కౌలు రైతులను ప్రోత్సహిస్తూ పెట్టుబడి సాయంగా ఏటా రూ.13,500 అందించింది. భూమి ఉన్న రైతులకు కాకుండా కౌలు రైతు లబ్ధి పొందేలా అన్ని సేవలను అందించారు. రైతులు, కౌలు రైతుల నెత్తిన భారం పడకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టి పంట నష్టపోయిన రైతులకు బీమా నగదు అందేలా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక ఏడాది ఎసరు పెట్టడమే కాకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తేసింది. మొత్తంగా కూటమి పాలనలో రైతులందరి పరిస్థితి దయనీయంగా మారింది.

కౌలు రైతులకు వెన్నుపోటు..

ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాట తప్పి వెన్నుపోటు పొడవడం వెన్నతో పెట్టిన విద్యని చాలా మంది అంటుంటారు. ప్రధానంగా రైతులను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ఒక ఏడాది అన్నదాత సుఖీభవ లేకుండా చేసింది. ఇపుడేమో కౌలు రైతులకు టోకరా ఇచ్చి అన్నదాత సుఖీభవ అందకుండా చేసింది. నేటికీ అన్నదాత సుఖీభవ అందకపోవడంతో కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి కూటమి ఎన్నికల ముందు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. తీరా అధికారంలోకి వచ్చాక మొదటి ఏడాది మొండిచేయి చూపించింది. ఉచిత పంటల బీమాను రద్దు చేసి రైతులపై ప్రీమియం భారం పడేలా చేసింది. ఈ ఏడాది షరతులతో రైతులను ఉక్కిరిబిక్కిరి చేసి కేంద్ర ప్రభుత్వ వాటా రూ.2 వేలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు కలిపి రూ.7 వేలు జమచేసింది. కౌలు రైతులకు మాత్రం పథకం దక్కకుండా చేసి సాగుపై ఆశలు సన్నగిల్లేలా చేసింది. పాయకరావుపేట నియోజకవర్గంలో 1,092 మంది కౌలు రైతులు ఉన్నారు. పాయకరావుపేట మండలంలో 327, నక్కపల్లి మండలంలో 130, ఎస్.రాయవరం మండలంలో 301, కోటవురట్ల మండలంలో 334 మంది కౌలు రైతులు ఉన్నారు. వీరికి బ్యాంకులు పంట రుణాలివ్వక అప్పుల పాలవుతున్నారు.

రేపు విజయవాడలో ఆటో కార్మికుల ధర్నా



మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి దేవుడు నాయుడు

రాంబిల్లి(అచ్యుతాపురం): విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఈ నెల 18న నిర్వహించే ఆటో కార్మికుల ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దేవుడు నాయుడు కోరారు. రాంబిల్లిలో మంగళవారం నిర్వహించిన ఆటో కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో కార్మికుల ఉపాధి తీవ్రంగా దెబ్బతిందని వాపోయారు. ప్రభుత్వం వాహన మిత్ర ద్వారా ఆటో కార్మికులకు ఏడాదికి రూ.30 వేల సాయం చేయాలని కోరారు. ఆటో కార్మికుల సంక్షేమ చట్టం తీసుకురావాలని, సబ్సిడీపై ఆటోలను కొనుగోలు చేసి కార్మికులకు ఇవ్వాలని కోరారు. ఆటో కార్మికులపై విపరీతంగా వేస్తున్న పెనాల్టీలు, చాలానాలు రద్దు చేయాలని, ఇన్సూరెన్స్ సొమ్ము ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నారాయణరావు, పైడిరాజు, శ్రీను, అప్పారావు, చంటి తదితరులు పాల్గొన్నారు.

ఐవీఆర్ఎస్ గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ



గుల్లిపాడులో చెత్త సేకరించే ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నక్కపల్లి: ఐవీఆర్ఎస్ గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. మంగళవారం ఆయన గుల్లిపాడులో ఇళ్ల నుంచి చెత్తను సేకరించే ప్రక్రియను పరిశీలించారు. సాస్ కార్యక్రమంలో భాగంగా ప్రజలెవరూ బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయొద్దని సూచించారు. క్లాప్ మిత్రలు, పారిశుధ్య కార్మికులు స్వయంగా ఇళ్లకు, వీధుల్లోకి వచ్చి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తారన్నారు. మండల, గ్రామ స్థాయి అధికారులంతా రోజూ ఉదయాన్నే వారికి కేటాయించిన ఐవీఆర్ఎస్ గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. ఉన్నతాధికారులు గ్రామాల్లో ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న డాన్ జిమ్ అధినేత విజయ్

మునగపాక: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శరీర దారుఢ్యం పెరుగుతుందని డాన్ జిమ్ అధినేత పెంటకోట విజయ్ పేర్కొన్నారు. స్థానిక సంతబయిలలో మరిడిమాంబ పండగ సందర్భంగా శరగడం కుమార్ జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి చెడుగుడు పోటీలను ఆయన మంగళవారం రాత్రి ప్రారంభించారు. ఈ పోటీలను తిలకించేందుకు క్రీడాభిమానులు హాజరయ్యారు. రిఫరీగా రాము వ్యవహరించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీకి ఎంతో ఆదరణ ఉంటుందన్నారు. క్రీడాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. జూనియర్ హైటెక్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విల్లూరి నాయుడు, కాండ్రేగుల మణికంఠ, ఆడారి గణేష్, టెక్కలి శివగణేష్, దొడ్డి సాయి, టెక్కలి యోగి, విల్లూరి రామ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కొత్తపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు



పాములవాక జెడ్పీ హైస్కూల్‌లో ఓ 3 ఆకారంలో విద్యార్థులు



ఓ త్రీ ఆకారంలో కూర్చొన్న విద్యార్థులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు గొడుగులు వేసుకుని, ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఓజోన్ పొర క్షీణత వల్ల కలిగే నష్టాలపై అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఓజోన్ పొరకు నష్టం కలిగించేలా మానవాళి చేస్తున్న చర్యల వల్ల వాతావరణంపై పడే ప్రభావం, తీసుకోవాలసిన సంరక్షణ చర్యలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం వైవీ రమణ మాట్లాడుతూ సూర్యుడి నుంచి వెలువడే అతినీలలోహిత(యూవీ) కిరణాలు భూమిపై నేరుగా పడకుండా ఓజోన్ పొర రక్షణ కల్పిస్తుందన్నారు. భూతలం నుంచి 18 నుంచి 50 కిలోమీటర్ల వరకు ఉన్న ఆవరణాన్ని స్ట్రాటో ఆవరణం అంటారని, ఇందులో 25–40 కిలోమీటర్ల మధ్య ఒక దట్టమైన పొర ఉంటుందని, దీన్నే ఓజోన్ పొర అంటారని వివరించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు కుందూరు రాజు, ఉపాధ్యాయులు సుసర్ల సూర్య ప్రకాష్, మంగపతి, ప్రసన్నరాణి, కుమారి, అమరావతి, రామలక్ష్మి, అపర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటవురట్ల: పాములవాక జెడ్పీ హైస్కూల్‌లో ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓజోన్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులు ఓ 3 ఆకారంలో విన్యాసం చేశారు. ఎంఈవో–1 రామారావు మాట్లాడుతూ ఓజోన్ పొర సూర్యుని అతినీలలోహిత కిరణాల నుంచి భూమిని కాపాడుతుందన్నారు. హెచ్ఎం వై.రామారావు, ఉపాధ్యాయులు సుజాత, భీమన్న, చిట్టియ్య, వరప్రసాద్, సుమతి, సరస్వతి, సావిత్రి, రామారావు, సంతోష్, సాయి పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు ఓత్రీ ఆకారంలో కూర్చొని నినాదాలు చేశారు. ఓజోన్ పొర దెబ్బతింటే పర్యావరణానికి ఎంత నష్టం కలుగుతుందో వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుధామాధురి, సైన్స్ ఉపాధ్యాయిని సుబ్రహ్మణ్యేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో నాటిక ప్రదర్శన రేపు

మునగపాక: మరిడిమాంబ పండగ సందర్భంగా ఈ నెల 18న కంటే కూతుర్నే కనాలి సాంఘిక నాటిక ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. మందబయిల రామాలయం వద్ద రాత్రి 9 గంటలకు మునగపాకకు చెందిన శ్రీ లక్ష్మీ కళా యూనియన్ పాటిదిబ్బ వారిచే ఈ నాటిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. రచన దాడి జగన్నాథరావు అందించగా, దర్శకత్వం దాడి మునిలినాయుడు వహించనున్నారు. కళాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నాటిక ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు.

20న భారీ అన్నసమారాధన

మునగపాక: స్థానిక సంతబయిలలో ఈ నెల 20వ తేదీన భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు వినాయక ఆలయ కమిటీ చైర్మన్ మండపాటి రాము మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక వేడుకల్లో భాగంగా పురాతన వినాయక ఆలయ ప్రాంగణంలో జరగనున్న అన్నసమారాధనకు భక్తులు తరలిరావాలని కోరారు.

రేపు కళ్యాణ మండపం లీజ్‌కి వేలం

పాయకరావుపేట: పట్టణంలో శ్రీరాధా రుక్మిణీ సహిత పాండురంగ దేవస్థానం కల్యాణ మండపాన్ని రెండు సంవత్సరాలకు లీజ్ వేలం వేయనున్నట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలో లీజ్‌కి బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు లక్ష రూపాయలు ధరావత్తుగా చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనాలన్నారు. మిగిలిన షరతులను ఆలయం కార్యనిర్వాహణాధికారి కార్యాలయంలో తెలుసుకోవాలన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నర్సీపట్నంలోని అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 18న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్..గోవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 35 సంవత్సరాలు వయస్సు కలిగిన నిరుద్యోగులు హాజరు కావాలన్నారు. 15 కంపెనీల్లో ఎంపికలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9000092227, 8106327482 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఈ– క్రాప్ నమోదు చేసుకోవాలి



ఈ– క్రాప్ నమోదు పరిశీలిస్తున్న ఏవో ప్రసాద్

నక్కపల్లి: రైతులంతా ఈ– క్రాప్ నమోదు చేసుకోవాలని ఏవో ఉమాప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన పలు గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతు తమ పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. మండలంలో వరి సాధారణ విస్తీర్ణం4350 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 4050 ఎకరాల్లో నాట్లు వేశారన్నారు. 14,500 ఎకరాల్లో ఉద్యాన వన పంటలు సాగు చేస్తున్నారన్నారు. గ్రామాల్లో జాయింట్ అజమాయిషీ ద్వారా వీఆర్వోలు, సర్వేయర్లు, రైతు సేవా కేంద్ర సిబ్బంది ఈ పంట నమోదు చేస్తున్నారని తెలిపారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, పంట రుణాలు, ఈ– క్రాప్ సర్టిఫికెట్, పంట నష్టపరిహారం, క్రాప్ ఇన్సూరెన్స్, వంటి పథకాలు రావాలంటే ఈ –క్రాప్ తప్పనిసరి అన్నారు. ఈ-పంట నమోదు కోసం దరఖాస్తు ఫారం, ఆధార్‌కార్డు, లేటెస్ట్ వన్‌బీ, బ్యాంకు ఆకౌంట్, ఫోన్ నెంబరు అందజేయాలన్నారు. వరి నాట్లు వేసేటప్పుడు పోటాషియం ఎరువులు వేయపోతే 25 రోజుల వయసులో20 కిలోల పోటాష్ వేసుకోవచ్చన్నారు. ఇప్పటి వరకు వివిధ ఆర్బీకేల ద్వారా 388 టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వాడ్రాపల్లిలో పర్యటించిన జిల్లా పంచాయతీ అధికారి



వాడ్రాపల్లిలో మాట్లాడుతున్న డీపీవో సందీప్

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఇ.సందీప్ కోరారు. మండలంలోని వాడ్రాపల్లిలో ఆయన మంగళవారం పర్యటించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం తదితర అంశాలపై పాలకులు, అధికారులు దృష్టి సారించాలన్నారు. పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు తీసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ గ్రామాభివృద్ధికి పాటుపడాలని సూచనలు చేశారు. సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. కేంద్రం నిర్వహణపై అధికారులు శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఈవోపీఆర్డీ సోమరాజు, మళ్ల వరహా నరసింగరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

డ్రోన్‌తో వ్యవసాయ పనులు



పాములవాకలో డ్రోన్ ఉపయోగాలను వివరిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

కోటవురట్ల: డ్రోన్ సహాయంతో వ్యవసాయ పనులు చేపట్టడం ద్వారా రైతుకు మేలు జరుగుతుందని వ్యవసాయాధికారి తెలిపారు. పాములవాకలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సౌజన్యంతో డ్రోన్ ఉపయోగాలను వివరించారు. క్షేత్ర స్థాయిలో వరి చేనుపై డ్రోన్ సహాయంతో నానో యూరియా పిచికారీ చేసి అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ వరిలో తెగుళ్లు సోకకుండా ఎకరా పరిధిలో 500 ఎంఎల్ నానో యూరియాను పిచికారీ చేయాలని సూచించారు. డ్రోన్ ద్వారా స్ప్రే చేయడం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా తక్కువ సమయంలో పూర్తి పరిమాణంలో చేనుకు ఎరువు అందుతుందన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, ఆత్మ ఏటీఎం సత్యవేణి, వ్యవసాయ విస్తరణాధికారి మధు, అగ్రికల్చర్ అసిస్టెంట్ బాలరాజు, రైతు వేచలపు భాస్కరరావు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న ఆధ్యాత్మిక సంఘ కర్త పరదేశినాయుడు

మునగపాక: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని ఆధ్యాత్మిక సంఘ కర్త శరగడం పరదేశినాయుడు కోరారు. వాడ్రాపల్లి రామాలయంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రామాయణం, భగవద్గీతపై అవగాహన పెంచుకోవాలన్నారు. దైవ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వాములు కావాలన్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, శరగడం రామేశ్వరరావు, టెక్కలి తులసీరావు, పెతకంశెట్టి రామజోగినాయుడు, మళ్ల వరహా నరసింగరావు, మళ్ల శేషు, బొడ్డేడ సత్యనారాయణ, మళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నునాయుడు, పెతకంశెట్టి శివాజీ, లీలా భాస్కరరావు, శివరామకృష్ణ పాల్గొన్నారు.

కృష్ణాపురం రైతుల ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కృష్ణాపురం రైతులు

అనకాపల్లి: స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద రాంబిల్లి మండలం కృష్ణాపురం గ్రామ రైతులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2005లో కంపెనీల ఏర్పాటుకు 130 మంది భూములు కోల్పోయారన్నారు. వీరికి ఆర్ అండ్ ఆర్ విధానం ద్వారా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తామని చెప్ప నేటికీ ఒక్క రూపాయి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 20 సంవత్సరాల క్రితం ప్యాకేజీ మాత్రమే ఇస్తామని అధికారులు చెబుతున్నారని, ప్రస్తుత రేటు ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించాలని తదితర డిమాండ్లతో ధర్నా చేశారు. కార్యక్రమంలో రాంబిల్లి గ్రామం రైతులు లక్ష్మి, సత్యవేణి, స్వప్న, అప్పారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.